# అనాధ విద్యార్దులకు అండగా వుంటాం


చిన్నారులకు పుస్తకాలు అందజేస్తునన ట్రస్టు సభ్యులు

బత్తలపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : అనాధ విద్యార్దులకు తమ ట్రస్టు అన్ని విధాలుగా ఆదుకుంటుందని హజరత్ ఇమామ్ ఏ ఖాసీం చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఇస్మాయిల్, చైర్మన్ మక్తుమ్ ఖాసీంలు అన్నారు.


పేదలకు బియ్యం పంపిణి చేస్తున్న దృశ్యం

సోమవారం వారు అనంతపురం జిల్లా క్రీసెంట్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టుకు చెందిన అనాధ విద్యార్దులకు 200కిలోల బియ్యం, 150 నోటు బుక్కులు, పెన్సిల్లు, పెన్నులు, ఇతర వంట సామాగ్రిని అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ చదువు విలువ తెలిసిన వాడిగా మెరిట్ విద్యార్దులకు వారి చదువు కోసం అండగా వుంటామన్నారు. మా లక్ష్యం మానవత్వం. అనంతరం విద్యార్దులకు క్రిస్మస్, నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రాత్రి పిల్లలకు అన్నధానం చేపట్టారు. అదేవిధంగా ధర్మవరంకు చెందిన తాజున్ని, బత్తలపల్లికి చెందిన షేక్ ఫకృభి, షేక్ ఖైరూన్‌లకు బియ్యం, వంటసరుకులు అందజేశారు. చలికాలం కావడంతో దుప్పట్లు పంచిపెట్టారు. రూ. 2వేలు ఆర్ధిక సాయం అందజేశారు. అంతేకాక గంటాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్ డయాబెటిస్ వ్యాధితో బాధపడుచుండగా అతనికి బియ్యం ప్యాకెట్, వంట సరుకులు, పండ్లతో పాటు రూ. 10వేలు ఆర్ధికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గ్యాస్ వెల్డింగ్ బాబావళి, టైలర్ ఖాజా హుస్సేన్, అహ్మద్, బాబాఫకృద్దీన్, సెక్షావలి, గుండు సాబ్, రామాంజి, మాతంగి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాంగ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆప్కో రాష్ట్ర డైరెక్టర్

-కొత్త శ్రీనివాసులును ఘనంగా సన్మానించిన సంఘం బాధ్యులు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి దేవాంగ సంక్షేమ సంఘం 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆప్కో రాష్ట్ర డైరెక్టర్ కొత్త శ్రీనివాసులు ఆవిష్కరించారు. సోమవారం మధ్యాన్నం పట్టణంలోని స్థానిక శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవాంగ కళ్యాణ మండపంలో సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ చంగల మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా క్యాలెండర్ ఆవిష్కరించిన కొత్త శ్రీనివాసులును సంఘం బాధ్యులు శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా కొత్త శ్రీనివాసులు మాట్లాడుతూ దేవాంగులు, చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ ప్రసిడెంట్ మిడతల విశ్వనాథ్, కోశాధికారి నిమ్మల వెంకటరమణ, సహాయ కార్యదర్శి చంగల అమరేష్, సభ్యులు గిద్దలూరి సూర్యనారాయణ, ఉట్టి వెంకటేశులు, చింతగింజల మల్లికార్జున, మేనేజర్ అంపాపతిని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

-తహశీల్దార్‌కు విన్నవించిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త : శింగనమల నియోజకవర్గంలో దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్‌చేశారు. సోమవారం పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్యకు వారు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ దళితులపై దాడి చేసిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దళితులకు న్యాయంజరిగేలా జిల్లాఅధికారులు తక్షణం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ తాలుకా అధ్యక్షులు జె.చెన్నప్ప, ఉపాధ్యక్షులు ఎన్.సురేష్, జిల్లా నాయకులు వెంకటేశులు, గౌరవాధ్యక్షులు యం.గంగాధర్, నాయకులు ఓబయ్య, మారుతి పాల్గొన్నారు.

# ఎన్నికల కోసమే రాజకీయం చేయడం మాకు తెలియదు..!

-ఇంద్రావతి విజయ సంకల్ప యాత్రలో వైసీపీ యువనేత వై.ప్రణయ్‌రెడ్డి


ఇంద్రావతిలో జరిగిన విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త : ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మాదిరి ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయం చేసి పబ్బం గడుపుకొని ఆ తరువాత కనబడకుండా పోవడం తమకు తెలియదని అనుక్షణం ప్రజల్లో ఉండి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే తమ ధ్యేయమని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.ప్రణయ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఇంద్రావతి గ్రామంలో 'విజయ సంకల్ప యాత్ర' నిర్వహించారు. గ్రామంలోని శ్రీ సుంకలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వై.ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఒక్కో కుటుంబానికి గడిచిన మూడున్నరేళ్లలో 3 నుండి 5 లక్షల రూపాయలు నేరుగా లబ్ది చేకూరిందన్నారు. జనాన్ని నమ్మించి మోసం చేసి చివరకు వెబ్‌సైట్ నుండి కూడా ఎన్నికల మేనిఫెస్టోను తొలగించిన ఘనత చంద్రబాబుదని వాపోయారు. వైసీపీ ప్రభుత్వంలో ఇప్పటివరకు ఇంద్రావతి గ్రామానికి 2 కోట్ల రూపాయల లబ్ది చేకూరిందన్నారు. 4 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పయ్యావుల కేశవ్ నియోజకవర్గానికి ఏం చేశారో ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్దమన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన మరుసటిరోజు నుండే మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రజల్లో ఉన్నారని ఆయన మాదిరి ఓడిపోయి ఏడ్చుకుంటూ ఇంట్లో కూర్చోలేదన్నారు. ఎమ్మెల్యే సొంత పంచాయతీలో రోడ్లు ఎలా ఉన్నాయో, రాకెట్ల పంచాయితీ ఎలా ఎన్నాయో, ఎవరేమి అభివృద్ధి చేశారో కౌకుంట్లలోనే చర్చకు తాము సిద్దమన్నారు. 6 నెలల్లో మైలారంపల్లి-వై.రాంపురం వరకు రోడ్డు వేయిస్తామన్నారు. ఈసారి కేశవ్ ఓటమి ఖాయమని నియోజకవర్గంలో వై.విశ్వేశ్వరరెడ్డి గెలుపు ఎప్పుడో నిర్ణయమైందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉరవకొండలో మిగిలిపోయిన 570 మంది లబ్దిదారులకు స్థలాలు చూపండి

-స్పందన కార్యక్రమంలో విన్నవించిన వినోద్‌నాయక్

ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త : ఉరవకొండలో సీయం హామీ పత్రాలు పొందిన 570 మంది లబ్దిదారులకు వెంటనే స్థలాలు చూపాలని కోరుతూ పట్టణానికి చెందిన ఎస్.వినోద్‌నాయక్ సోమవారం జిల్లా కేంద్రం అనంతపురంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 3వేల మందికి ఇంటి పట్టాలు పంపిణీచేసి స్థలాలు చూపారని మిగిలిన లబ్దిదారులకు స్థలం కోర్టు కేసుల్లో ఉందంటూ నాడు హామీ పత్రాలు మాత్రమే పంపిణీ చేసి వదిలేశారన్నారు. హామీ పత్రాలు ఉన్న లబ్దిదారులకు కోర్టులో వివాదంలోలేని భూమిలో స్థలాలు చూపాలని విన్నవించడం జరిగిందన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా రాజీలేని పోరాటం..!

-ఉరవకొండలో ఘనంగా సీపీఐ 98వ ఆవిర్భావ దినోత్సవం


పార్టీ జెండాను ఎగురవేస్తున్న సీపీఐ సీనియర్ నాయకులు ఎస్.శివన్న

ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలకు వ్యతిరేఖంగా రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ సీనియర్ నాయకులు ఎస్.శివన్న పేర్కొన్నారు. ఉరవ కొండ పట్టణంలోని స్థానిక ఐదుకల్లు సదాశివన్ భవనంవద్ద సోమవారం సీపీఐ పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగగా ఆయన పార్టీ జండా ఎగురవేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్బంగా జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఎంతోమంది మేధావులు కమ్యూనిస్టు ఉద్యమంలో చివరి వరకు ప్రభుత్వ నిర్భంధాలను ఎదుర్కొని జైలు జీవితాలు గడిపి, మిలిటెంట్ ఉద్యమాలు నడిపి అమరులయ్యారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ప్రజా పోరాటాలు స్వాతంత్రంగా నిర్వహిస్తూ అన్ని వామపక్ష పార్టీలను కలుపుకొని అన్నివర్గాల సమస్యలపై పోరాటాలు చేసిన, చేస్తున్న ఘనత సీపీఐకే దక్కిందన్నారు. ఎక్కడ ఎప్పుడు ఏ సమస్య ఉత్పన్నమైనా వెంటనే స్పందించి వాటి పరిష్కారం కోసం సీపీఐ పార్టీ పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎర్రిస్వామి, సీపీఐ తాలుకా కార్యదర్శి జె.మల్లికార్జున, సహాయ కార్యదర్శులు జి.వన్నూరుసాబ్, కె.చెన్నరాయుడు, మండల కార్యదర్శి తలారి మల్లి, నాయకులు గెన్నె మల్లేసి, సుల్తాన్, గణప మల్లి, రజాక్‌షేక్, చక్రధర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్సీగా గెలిపించండి

-పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు

ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త : గత 32 సంవత్సరాలుగా అనేక ప్రజా ఉద్యమాల్లో భాగస్వామినై ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని సైతం వదులుకున్న తనకు ఒక్క అవకాశం కల్పించి ఎమ్మెల్సీగా గెలిపించాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం పీడీఎఫ్ అభ్యర్థి డా॥పోతుల నాగరాజు కోరారు. పట్టణంలోని జాతీయ రహదారికి పక్కనగల శ్రీకృష్ణ యాదవ కళ్యాణ మండపంలో వివిధ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో జరిగిన ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా 44 మంది అభ్యర్థుల్లో తాను కేవలం 454 ఓట్ల దూరంలో నిలిచిపోవడం జరిగిందన్నారు. తనను గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను మండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలరంగయ్య, రంగారెడ్డి, సీపీఐ నాయకులు మనోహర్, శివ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోసా రాము, యుటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు రామప్పచౌదరి, సంజీవ, హనుమప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దార్థ, సింహాద్రి, తిప్పేస్వామి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యం ఇవ్వడంలేదని ధర్నా

-డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత


డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం డిసెంబర్ నెలకు సంబంధించి నెల గడిచిపోతున్నా ఇప్పటివరకు పంపిణీ చేయడం లేదంటూ మహిళలు వజ్రకరూరు మండల తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా రేషన్ కార్డు లబ్దిదారులైన మహిళలు మాట్లాడుతూ కేంద్రం అందించిన బియ్యాన్ని ఎఫ్‌పీ షాపు డీలర్లు పంపిణీ చేయకుండా అవకతవకలకు పాల్పడుతున్నారని బియ్యం కోసం నిలదీస్తే పొంతనలేని సమాధానంతో కాలం వెల్లబుచ్చుతున్నారని మండిపడ్డారు. ఉచిత బియ్యంను డీలర్లు ఎంచేశారో సమగ్ర విచారణ జరిపి తమకు బియ్యం పంపిణీకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

# వైకుంఠ రథానికి విరాళం అందచేసి దాతలు


విరాళం అందచేస్తున్న దృశ్యం

గోరంట్ల, డిసెంబర్ 26 ప్రభాతవార్త : గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచు సరోజానాగేనాయక్, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ వైకుంఠ రథం కొనుగోలు చేయడానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు, వ్యాపారస్తులు స్పందించి తమవంతు సహాయంగా విరాళాలు అందించాలని కోరగా మండలంలోని మల్లాపల్లి గ్రామ పంచాయతీకి చెందిన నాగరాజు తమవంతు విరాళంగా 20 వేల రూపాయలను అదే గ్రామానికి చెందిన మహమ్మద్ 20 వేల రూపాయల విరాళాన్ని పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్‌కు అందచేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

# సింగిరెడ్డిపల్లిలో రూ.5లక్షలతో బోరుబావి తవ్వకం

గోరంట్ల, డిసెంబర్ 26 ప్రభాతవార్త : గోరంట్ల పంచా యతీ పరిధిలోని సింగిరెడ్డిపల్లి గ్రామంలో పూర్తిస్థాయిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం 5 లక్షలతో ఎంపిపి నిధుల కింద బోరుబావితో పాటు గ్రామంలోకి పైపులైన్ మోటర్ ఏర్పాటు చేసేందుకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి బోరు వేయడం ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలోఎంపిపి ప్రమీల మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సర్పంచు సరోజానాగేనాయక్, కార్యదర్శి సతీష్‌కుమార్, అప్పిరెడ్డి, డీలర్ మంజునాథ్, సమర, అశ్వర్థ, నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, సోముశేఖర్, వెంకటనారాయణ, పాల్గొన్నారు.


బోరు వేస్తున్న దృశ్యం

# అయ్యప్ప మండల పూజలో పాల్గొన్న మాజీ ఎంపి నిమ్మల, సవితమ్మ


అయ్యప్ప పూజలో పాల్గొన్న సవితమ్మ

గోరంట్ల, డిసెంబర్ 26 ప్రభాతవార్త : పట్టణంలోని సిటిసి థియేటర్ ఎదురుగా వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో సోమవారం మండల పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మండల పూజ కార్యక్రమం టిడిపి నాయకులు నిమ్మల శ్రీనాథ్, నిమ్మల శ్రీధర్ కుటుంబసభ్యులు ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, తేదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ హాజరై ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం 2 వేల మంది అయ్యప్పలకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామిని భక్తిశ్రద్ధలతో చక్కభజనలు వాయిద్యాలతో భారీ ఎత్తున పట్టణంలో ఊరేగింపు నిర్వహించగా భారీ సంఖ్యలో భక్తులు, మహిళలు తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచు నిమ్మల చంద్రశేఖర్, మాజీ ఎంపిపి విద్యాధరణి, కృష్ణమూర్తి, వాటర్‌ప్లాంట్‌నాగరాజు, టవల్‌నరసింహులు, బాలకృష్ణచౌదరి, రామమోహన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.


అయ్యప్పలకు భిక్ష వడ్డిస్తున్న దృశ్యం

# వెయిట్‌లిఫ్టింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బుక్కపట్నం విద్యార్థులు


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

బుక్కపట్నంరూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త : అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో (ఎస్‌జిఎఫ్) స్కూల్ గేమ్స్ నందు బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. 10వ తరగతి విద్యార్థి కె.చైతన్యసాయి (10వ తరగతి) 55 కెజిల విభాగంలో 100 కెజిల బరువు ఎత్తి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. కె.సుభాష్ (9వతరగతి) 75 కెజీల విభాగంలో 98 కెజీల బరువు ఎత్తి రాష్ట్ర స్థాయికి ఎంపికకావడం జరిగిందన్నారు. అలాగేష్ గణేష్ రెడ్డి (8వ తరగతి), 58 కెజీల విభాగంలో 80 కెజిల బరువు ఎత్తి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం పొందాడన్నారు. ధనుష్ రెడ్డి (10వ తరగతి) 85 కెజీల విభాగంలో 72 కెజీల బరువు ఎత్తి తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పి.హరికిరణ్, పిడి బి.నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

# భవిష్యత్తులో ఉత్తమ ఫలితాల కోసమే ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తచెరువు, డిసెంబర్ 26, ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర విద్యాభివృద్ధికోసం భవిష్యత్తరాల కొరకు ట్యాబ్‌లను పంపిణీ చేయడం జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన కొత్తచెరువులోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఇఓ వెంటరమణనాయక్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెన్నక్రిష్ణారెడ్డి, సుమన, మండలకన్వీనర్ జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 322 మంది విద్యార్థులకు ఈ ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం జడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో 76, బాలికల ఉన్నత పాఠశాలలో 73 ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు తెలియజేశారు. అనంతరం వారు ట్యాబ్‌ల యొక్క వినియోగం గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం శాంసంగ్ కంపెనీకి చెందిన ట్యాబ్, పౌచ్, చార్జర్లను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలియజేశారు. విద్యార్థుల ఈ ట్యాబ్‌ను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ ట్యాబ్‌ల వినియోగంపై రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, వైస్‌ఎంపిపిలు గంగరాజు, టౌన్ కన్వీనర్ ముద్దల భాస్కర, వైకాపా నాయకులు వాల్మీకి శంకర్, సుబ్బారావు, పాపన్న, నాగరాజు, రామచంద్ర, పేయింటర్ కేశవ, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్‌గా పదవీబాధ్యతల స్వీకరణ


సెక్టోరియల్ అలెస్కో అనందబాబు


అసిస్టెంట్ సెక్టోరియల్ ఎఎంఓ అబ్దుల్‌మాలిక్(ఉర్దూ)


అసిస్టెంట్ సెక్టోరియల్ ఎఎంపి మహేందర్ రెడ్డి(జనరల్)


అసిస్టెంట్ సెక్టోరియల్ జెసిడిఓవి. శివమాధవి

కొత్తచెరువు, డిసెంబర్ 26, ప్రభాతవార్త : ఈ నెల 19వ తేదిన శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయం నందు నిర్వహించిన సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంకోరియల్ పోస్టుల ఇంటర్వ్యూలలో నలుగురు ఎంపికకాగా, వారు సోమవారం డిఇఓ కార్యాలయం నందు బాధ్యతలు స్వీకరించారు. సెక్టోరియల్ అలెస్కోగా ఆనంద్‌బాబు, అసిస్టెంట్ సెక్టోరియల్‌లు ఎఎంఓలుగా అబ్దుల్‌మాలిక్ (ఉర్దూ), మహేంద్రరెడ్డి(జనరల్), అసిస్టెంట్ సెక్టోరియల్ జెసిడిఓగా వి.శివమాధవిలు సోమవారం తమ బాధ్యతలను సమగ్ర శిక్ష కార్యాలయం నందు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంతటి మహోన్నత బాధ్యతలు తమకు అప్పగించినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ శాయ శక్తుల తమ విధుల పట్ల బాధ్యతతో మెలిగి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ మేరకు వారిని పలు ఉపాధ్యాయ సంఘాలనాయకులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికి అభినందనలు వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రి పుట్టినరోజు కానుకగా వివిధ పింఛన్ల తొలగింపు హేయం

– సిపిఎం పార్టీ శ్రేణులు


మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానికు వినతిపత్రంను అందచేస్తున్న సిపిఎం పార్టీ శ్రేణులు తదితరులు

గుంతకల్లు, డిసెంబర్ 26 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రజల పట్ల ముఖ్యమంత్రి జగన్ తన పుట్టినరోజు కానుకగా లబ్దిదారుల వివిద పింఛన్‌లను తొలగింపు చర్యలను చేపట్టిన వైకాపా ప్రభుత్వ పనితీరు హేయంగా ఉందని సిపిఎం పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. సోమవారం సిపిఎం పార్టీ శ్రేణులు గుంతకల్లు పురపాలక సంఘం కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానికు వినతిపత్రంను అందచేశారు. అంతకుముందు కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో భాగంగా పార్టీ పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులుగా ఉన్న లబ్దిదారుల పట్ల వివిద కారణముల సాకుగా పింఛన్లను తొలగిస్తూ ఉత్తర్వులను జారీ చేసిన ప్రభుత్వం తీరు గర్హనీయంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇటీవల తన పుట్టినరోజుతో ప్రజలకు మరిన్ని ఉపకారాలు చేస్తారన్న ధీమాగా ఉన్న ప్రజలకు అపకారం తీరులో వారి పట్ల శాపంగా పరిణమించేలా ప్రస్తుతం పింఛన్ల తొలగింపు చర్యలు చేపట్టడం శోచనీయమన్నారు. పట్టణంలో దాదాపు 1100 దాకా ఉన్న పింఛన్లను తొలగించడానికి మున్సిపల్ అధికారులచే ప్రభుత్వం ప్రయత్నాలు చేయడంను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం తీరుకు నిదర్శనంగా 30శాతంగా పేదప్రజలకు 300యూనిట్లు వచ్చాయంటూ బిల్లులు అందించిన వైనంలోను, 60శాతంగా వెయ్యి గజాలకు పైగా నివేశ స్థలాలున్నట్లు చూపించడం, రేషన్ కార్డులలో భర్త పేరుందని, వికలాంగులకు పర్సెంటేజీ తక్కువగా ఉందంటూ, వృద్ధులకు ఆధార్‌కార్డులలో అవకతవకలున్నాయన్న కారణాల సాకుగా పింఛన్ల తొలగింపు చర్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. వారి పింఛన్ల తొలగింపుల కారణంగా భాధిత లబ్దిదారులు ఆర్ధిక సమస్యలతో చాలా ఇబ్బందులకు గురికానున్న తీరును ప్రభుత్వం గుర్తించాలన్నారు. పింఛన్ల తొలగింపు చర్యలను మానుకోవాలని, నూతనంగా అర్హులైన లబ్దిదారులకు కొత్త పింఛన్లను అందచేసి వారికి సహాయం అందిస్తూ సహకరించాల్సిన భాధ్యత ప్రభుత్వంకు ఎంతైనా ఉందన్న సత్యాన్ని గుర్తించాలని హితవు చెప్పారు. లేనిపక్షంలో తాము లబ్దిదారులైన పేదప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆంధోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మారుతిప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, రంగమ్మ, తిమ్మప్ప, రామునాయక్, ఓబులేసు, షబ్బీర్, అబ్దుల్లా, చరణ్, సుబ్బయ్య, ఎస్ఎఫ్ఐ శ్రేణులు వెంకీ, కిశోర్‌లు, కెవిపిఎస్ శ్రేణులు వీరన్న, వీరస్వామి, రామయ్య, ఆవాజ్ కమిటీ శ్రేణి మస్తాన్‌లతో పాటు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో జగనన్న సంక్షోభ పాలన వద్దు... చంద్రన్న సంక్షేమ పాలన ముద్దు...

– తెలుగుదేశం శ్రేణులు


నక్కనదొడ్డితాండా గ్రామంలో " ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి " కార్యక్రమంలో టిడిపి శ్రేణులు తదితరులు.

గుంతకల్లు, డిసెంబర్ 26 ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ రామరాజ్యంగా ప్రజాసంక్షేమమైన పాలనగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు సారథ్యంలోనే సాధ్యమన్న సత్యాన్ని గుర్తించాలని, ప్రజా సంక్షేమ పాలనకు స్వాగతిస్తూ తెలుగుదేశం ప్రభుత్వంతో ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు అవకాశం కల్పించాలని టిడిపి శ్రేణులు పిలుపునిచ్చారు. టిడిపి రాష్ట్ర కమిటీ ఆదేశాలతో అధినేత చంద్రబాబు ఉత్తర్వుల మేరకు మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ ఆదేశాలతో " ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి " కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని నక్కనదొడ్డి, నక్కనదొడ్డితాండా గ్రామాలలో పలువురు పట్టణ శ్రేణులు పట్టణ, మండల కార్యకర్తలతో పర్యటించారు. ఈ సందర్భంగా వారు పతి ఇంటి వద్దకు చేరుకుని " ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి " అన్న కరపత్రాల పంపిణీ చేస్తూ తెదేపా పట్ల ప్రతి ఒక్కరూ జాగృతమై ముఖ్యమంత్రిగా చంద్రబాబును స్వాగతించాలని ప్రజల్లో చైతన్యం కల్పించారు. రాష్ట్రంలో గత మూడున్నరేళ్లుగా జగన్‌రెడ్డి నేతృత్వంలోని వైకాపా ప్రభుత్వంకు ఒక్క అవకాశం కల్పిస్తే రాజన్నరాజ్యంగా పాలన అందిస్తానంటూ రాక్షసత్వం తీరులో ప్రజలకు బాదుడే భాదుడుగా సంక్షోభమైన నిరంకుశ పాలన సాగుతుండటం భాధాకరమన్నారు. సదరు వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి, అక్రమాలు, భూదందా, ఆక్రమణలు, ప్రజల పట్ల దోపిడీ విధానాలతో వివిద పన్నుల, చెత్త పన్నులతో పాటు నిత్యవసర సరుకుల ధరల పెరుగుదలకు కారకులుగా మారిన తీరు గర్హనీయంగా ఉందన్నారు. ఒక్క అవకాశంతో ఇంత నరకం, మరోమారు అవకాశం కల్పిస్తే మరింత నరకం తప్పదన్న సత్యాన్ని గుర్తించి ప్రజలు జాగృతం కావాలంటూ వారివారి కుటుంబాల యోగక్షేమాలను తెలుసుకుంటూ సమస్యల వివరాలను సేకరించారు. గతంలోని తెదేపా పాలనలో చంద్రన్న పింఛన్ కానుక, సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫా, దుల్హన్ పథకం తదితర కానుకలతో పాటు మరిన్ని పథకాలుగా లబ్దిదారులుగా ప్రజలకు అందించిన తీరులో ఆయా కుటుంబాలలో ఆనందం చూశామన్నారు. కాని ప్రస్తుతం అదిగో "ఒక్క అవకాశం" ఇవ్వాలని కోరుతూ ఇదిగో "నవరత్నాలు" అంటూ మభ్యపెట్టి మూడున్నర యేళ్లుగా బాదుడే బాధుడుకు తెరతీస్తూ వైకాపా ప్రభుత్వం పనితీరులోని రాక్షసపాలనను నిలదీయాలన్నారు. ప్రస్తుత పరిస్థితులను అనుసరించి వైకాపా రాక్షసపాలనకు చరమగీతం పాడుతూ రానున్న రోజుల్లో ప్రజా సంక్షేమంతో కూడిన అభివృద్ధియే సంకల్పం గల ప్రభుత్వ పాలనే ముద్దు అన్న సంకేతంగా రాబోవు ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఓట్లను వేసి ముఖ్యమంత్రిగా చంద్రబాబును స్వాగతించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్‌కుమార్‌గౌడ్, ఆర్.అనిల్‌కుమార్‌గౌడ్, కేశప్ప, ముక్కన్నగారి రామాంజినేయులు, దోనిముక్కల గ్రామసర్పంచు యు.శ్రీరాములు, గుమ్మనూరు వెంకటేష్, పాలమల్లికార్జున, ఫ్రూట్‌మస్తాన్ తదితరులతో పాటు పలువురు పట్టణ, మండల శ్రేణులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంస్థ విభాగాల కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

పుట్టపర్తి, డిసెంబర్ 26, ప్రభాతవార్త : స్పందన గ్రీవెన్స్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు ఎస్పి రాహుల్‌దేవ్ సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి 46 అర్జీలను ఎస్పి స్వీకరించారు. రస్తావివాదాలు, కుటుంబ కలహాలు, అదనపు కట్నం, భర్త/అత్తారింటి వేధింపులు, ఉద్యోగ మోసాలు భూవివాదాలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు ఇలా తమకున్న సమస్యలను ఎఎస్పి ముందు స్వేచ్ఛగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి కె.వి.రామకృష్ణప్రసాద్, ఎస్బి డిఎస్పి ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్, ఎఎస్పీ కె.వి.రామకృష్ణప్రసాద్

## ఘణంగా సిపిఐ పార్టీ ఆవిర్బావ వేడుకలు


సిపిఐ జెండాను ఆవిష్కరిస్తున్న మధు

**బత్తలపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘణంగా నిర్వహించారు. సోమవారం మండలకేంద్రంలో ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మధు పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా పేదవారి కోసం పోరాటాలు చేసింది మాత్రం ఒక్క ఎర్రజెండా పార్టీయేనన్నారు. ఉధ్యమాల ద్వారా పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కమతం కాటమయ్య, కుళ్లాయప్ప, బండల వెంకటేషు, రమణ, మందల క్రిష్ణా, పెద్దన్న, నరసింహులు, ఎంపి వెంకటేషు తదితరులు పాల్గొన్నారు.

## రెండురోజుల పాటు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్

**బత్తలపల్ల, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని సచివాలయం 2లో మూడ విడత కింద రెండురోజుల పాటు ఆధార్ ఎన్‌రోల్‌మెంటు వుంటుందని ఎంపిడిఓ సాయిమనోహర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 29, 30వ తారీకులలో ఈ ప్రత్యేక ఆధార్ నమోదు, అప్‌డేట్ చేసుకునేందుకు ఉన్నతాధికారులు అవకాశం కల్పించారన్నారు. 2010 నుండి 2016వరకు ఆధార్‌కార్డు చేయించుకున్న వారు డాక్యుమెంటు అప్డేటుచేయించుకోవాలన్నారు. అంతేకాక 5సంవత్సరాల వయసు పైబడిన చిన్నారులతో థంబ్ వేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన హెచ్‌వి వెంకటేష్


నివాళులు అర్పిస్తున్న హెచ్‌వి వెంకటేష్

**పావగడ, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** పావగడ తాలూకా రాజవంతి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందిన గంగరాజు కుటుంబాన్ని బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షులు, మాజీ జిల్లా పంచాయితీ మెంబర్ హెచ్‌వి వెంకటేష్ పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మీకు అన్ని విధాలుగా తోడుంటానని వారికి భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందించారు.

## లారీకి ద్విచక్ర వాహనం ఢీ.. యువకుడు మృతి


ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు


ప్రమాదంలో మరణించిన నాగరాజు ఫైల్‌ఫోటో

**పావగడ, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** పావగడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజవంతి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజు (28) అనే యువకుడు మృతి చెందిన సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాలూకాలోని వైఎన్ హళ్లికి చెందిన మృతుడు గంగరాజు కొరటగెరలోని ఐఐఎఫ్ ఎల్ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడని సోమవారం వాహనంలో కొరటిగెరకి వెళ్తుండగా రాజవంతి సమీపంలో నిలబెట్టిన గ్రానైట్ లారీని ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనా స్థలానికి స్థానిక సిఐ అజయ్ సారధి చేరుకుని శవాన్ని పోస్టు మార్టంకు తరలించి మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతునికి వివాహమై 22 రోజులు అయినట్లు తెలియజేశారు.

## ఈడిగల ఐకమత్యంతోనే సభ విజయవంతం

**- రాష్ట్ర పరిశీలకులు తాత జయప్రకాష్ నారాయణ**


మాట్లాడుతున్న తాత జయప్రకాష్ నారాయణ

**పెనుకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** ఈడిగల ఐక్యమత్యంతోనే ఈడిగ సాధికార కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జయప్రదమైందని రాష్ట్ర పరిశీలకులు తాతాజయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. శ్రీ సత్యసాయిజిల్లా ఈడిగ సాధికార జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈడిగకులస్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని బ్రాందీ షాపులు 30 శాతం కేటాయించే విధంగా చూడాలని చంద్రబాబునాయుడు కోరుతున్నామన్నారు. గీత కార్మికులు ప్రమాద వశాత్తు మరణించిన వారికి భీమా ఇవ్వకుండా ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు, ఈత, కొబ్బరి, తాడిచెట్ల నుంచి నీరా తయారు చేయుటకు నిల్వ కేంద్రాలు ఏర్పాటు 50 ఏళ్లునిండిన వారికి పెన్షన్ స్కీమ్‌తోపాటు ఎక్సైజ్ శాఖ నుంచి ఐడి కార్డులు జారీ తదితర అంశాలను నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, బిసి సెల్‌రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్రల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలోచిన్నప్పయ్య, గిరిధర్‌గౌడ్, మహేష్‌గౌడ్, శ్రీనివాసులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో చురుకుగా పిఓఎల్ఆర్ పనులు


అల్లికెరలో పిఓఎల్ఆర్ పనుల్లో నిమగ్నమైన రెవెన్యూ సిబ్బంది

**అగళి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్‌పై సర్వే వేగవంతంగా సాగుతోంది. సర్వేర్లు ఉన్న ప్రతి పంచాయితీలోనూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోడిపల్లి, రావుడి పంచాయితీలు మినహా అన్నిపంచాయితీలను సర్వేయర్లు ఉండటంతో పిఓఎల్ఆర్ పనులుచురుకుగా సాగుతున్నాయి. రైతులు ఈసర్వే సమయంలో పాల్గొని రైతుకు సంబంధించిన భూ వివరాలు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, 1బి పాస్‌పుస్తకం, బ్యాంకు పాస్‌పుస్తకం, రికార్డులను అధికారులకు ఇచ్చి సర్వే చేయించుకోవాలన్నారు. రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, ఖాతా నెంబర్లు, హద్దులు, విస్తీర్ణాన్ని కచ్చితంగా నిర్ణయించి రాళ్లు వేయడంతోపాటు పిఓఎల్ఆర్ పనులు పూర్తి అయిన తర్వాత వారికి ఆధార్‌కార్డు మాదిరి 11 నెంబర్లు ఉన్న ఒక నెంబర్‌ను కేటాయిస్తారని, ఈ కార్డు ఉంటే అన్ని పనులు అనగా బ్యాంకుల్లో రుణాలు, వడ్డీ మాఫీ, ఇన్సురెన్స్, యంత్ర పరికరాలు, సబ్సిడి ఎరువులు, విత్తనాలు ఈ కార్డును చూపిస్తేనే రైతులకు అందుతాయి. అందుకే రైతులు ఈ సర్వేలో కచ్చితంగా పాల్గొని వారికి సంబంధించిన రికార్డులను చూపించి వారిభూములకు సంబంధించినకచ్చితమైన సమాచారాన్ని తీసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు జీలాని, డిప్యూటీ తహశీల్దారు సుబ్బారావు, ఆర్ఐగుర్రన్న, విఆర్ఓలుదొడ్డయ్య, నరసింహమూర్తి, లావాణ్య, మంజుల, రాజకుమారి, వరలక్ష్మి, విఆర్ఏలు సర్వేయర్లు శ్రీనివాస్, జీవన్, కార్తిక్, రంగరాజు, మంజునాథ్ పాల్గొన్నారు.

## ఇదేం ఖర్మరా బాబు మన మండలానికి


ఇందేం ఖర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు

**అగళి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు ఆదివారం కొమరేపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, మన మండలానికి అని తెలుగు దేశం పార్టీ నాయకులు ఇంటింటి పోస్టర్లను అందింటి, ఇంటింటికీ పోయి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇసుకకు పడుతున్న ఇబ్బందులు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదల, నిత్యావసరాలు ఆకాశాన్నంటడం, రోడ్లు, కల్వర్టులు ధ్వంసమైన పట్టించుకునే వారు లేక పోవడం ఎఫ్‌పి షాపుల్లో బియ్యం తప్పా మరొకటి ఇవ్వక పోవడం లాంటి సమస్యలను ఇంటింటా తెలియజేశారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీనాయకులు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు తిప్పేస్వామి, శివకుమార్, మల్లేష్, లింగరాజు, జయరామ్, బసవరాజు, నరసింహమూర్తి, ఈశ్వరప్ప, దేవరాజు రాజ్‌గోపాల్, గురునాథ్, రంగనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అనాధ శవానికి అంతిమసంస్కారాలు


మృతదేహాన్ని తరలిస్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

**గుంతకల్లు టౌన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** ఆ నలుగురు సేవాసమితి ఆధ్వర్యంలో అనాధ శవానికి అంతిమసంస్కారాలు నిర్వహించారు. రెండవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో బురుజ ఆంజనేయ స్వామి దేవాలయం ఎదురుగా గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని పోలీసులు సమితి సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు స్పందించారు. సోమవార ం పాత గుంతకల్లులోని హిందూ స్మశానవాటికలో అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకులు మంజుల వెంకటేష్, శ్రీధర్‌రెడ్డి, రవీంద్ర, రాజశేఖర్, మహేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**చెన్నేకొత్తపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** మండల పరిధిలోని టిబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పడిన ఆదిశక్తి సొసైటీ సదస్సు ఆధ్వర యంలో సోమవారం మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి జడ్పిహెచ్ఎస్ హై స్కూల్‌లో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈఅవగాహనసదస్సుకు చెన్నేకొత్తపల్లి బిసి కాలనీ లోని ఆదిశక్తి సంఘం సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ఆదిశక్తి సొసైటీ అధ్యక్షురాలు ఆదెమ్మ, సీఈఓ రమీజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింస వేదింపులు వివిధ అంశాలపై అలాగే మహిళలకు డబ్బు మీద అధికారం ఎంత వరకు ఉందని ఒక నాటిక ద్వారా ప్రదర్శన చేసి సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోఆదిశక్తి పాలకవర్గ సభ్యులు, మనీలమ్మ, సుజాత, వెంకటలక్ష్మి, డైరెక్టర్ సి.సుబ్బమ్మ, మహాశక్తి సొసైటీ సీఈఓ అశ్విని, దుర్గాశక్తి సొసైటీ సీఈఓ కవిత పాల్గొన్నారు.

## ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- తేదేపా మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప**


మద్దనకుంటప్ప

**గుడిబండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎస్.రాయపురం గ్రామ పంచాయితీ తెలుగు దేశం పార్టీ నిర్వహిస్తున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగు దేశపార్టీ మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం అరాచకాలను, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ తెలుగు తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి హాజరవుతారని మండలంలోని తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలోపాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఆసుపత్రి ఆవరణలో మరమ్మత్తులు చేపట్టాలి

**- ఎంపిపి గుర్రం వనజ**


ఆసుపత్రిలో సమావేశమైన అభివృద్ధి కమిటీ సభ్యులు

**బత్తలపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని ఎంపిపి గుర్రం వనజ శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం వైద్యాధికారిణి తేజశ్రీ ఆధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలకు ఆగివున్న నీటి గుంతలలో మట్టిని తోలించడం, నీటి అవసరాల కోసం ఆసుపత్రి ఆవరణలోని బోరుకు మరమ్మత్తులు చేయించడం, ఆసుపత్రి, నిర్మాణంలో వున్న సచివాలయ భవనం మధ్యలో కాంపౌండ్ వాల్ కట్టించడం చేయాలన్నారు. అంతేకాక రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ పనులను అధికారులు త్వరిత గతిన పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కమతం వరలక్ష్మి, కార్యాలయ సిబ్బంది వేణుగోపాల్, పర్యవేక్షక సిబ్బంది వేమారెడ్డి, నారమ్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధేశ్వరుని సన్నిధిలో విశేష పూజా కార్యక్రమం

**అమరాపురం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**

మండల పరిధిలో హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ జెడ్పిటిసి డాక్టర్. శ్రీనివాసమూర్తి, నరసింహమూర్తి తదితరులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెంజేరు సిద్ధేర స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి విశిష్టతను తెలియజేశారు. అలాగే తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం నందు స్థానిక టిడిపి పార్టీ నాయకులు, వాల్మీకి సంఘం కార్యదర్శి అనిల్‌కుమార్, గొల్లమారన్నపల్లి రామచంద్ర, కుమారసా ్వమి, జయకుమార్, మండల కన్వీనర్ గణష్, ఓంకారస్వామి, మురళీ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క చాన్సు పేరిట ప్రజలను వంచిస్తున్న జగన్

**-రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి**


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

**అమరాపురం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** ఒక్క చాన్సు ఇస్తే చాలు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలను నిలువునా వంచించినట్లు మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. మండల పరిధిలోని హేమాతి గ్రామం నందు జరిగిన ఇదేమీ కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి, మండల కన్వీనర్ గణేస్ అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ తోపాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్. శ్రీనివాసమూర్తి, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, లీగల్ సెల్ కార్యదర్శి రాధాకృష్ణ, రాష్ట్ర వాల్మీకి సంఘం కార్యదర్శి తమ్మిడేపల్లి అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళి ఇదేమీ కర్మ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ వ్యతిరేఖ విధానాల పట్ల ప్రజల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ నిత్యవసర సరుకులు కొనలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని. గ్యాస్ ఫెట్రోల్ ధరలు విఫరీతంగా పెరిగాయన్నారు. రైతు వేసుకున్న బోర్లుకు మీటర్లు బిగించడానికి సిద్ధం చేసినందున రైతుల పరిస్థితులు కడు దుర్భరంగా మారునున్నాయన్నారు. రాష్ట్రకార్యదర్శి డా. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులకు పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం కొట్టుమిట్టాడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ముందస్తు ఎన్నికలు వచ్చేసూచనలు ఉన్నట్లు టిడిపికార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. మడకశిర నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ ఆదేశాలకు అనుగుణంగా ఎమ్మెల్యే అభ్యర్థిని గెలుపించుకోవడంతోపాటు మాజీ ఎమ్మెల్సీని ఢిల్లికి పంపే విధంగా సిద్ద పడుదామని పిలుపు నిచ్చారు. గొల్ల మారెన్నపల్లి, హేమావతి, గుణేహళ్లి గ్రామాల నుంచి టిడిపి పార్టీలో వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు చేరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, రిటైర్డ్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి మల్లికార్జున, ఎస్సీ సెల్ నియోకవర్గ అధ్యక్షులు జయకుమార్, సీనియర్ నాయకులు కుమారస్వామి, గొల్లమారెన్నపల్లి రామచంద్ర, ఎంపిటిసి ఓంకారస్వామి, కోఆర్డినేటర్ కృష్ణమూర్తి, రిటైర్డ్ ఎస్ఐ రంగస్వామి, మాజీ ఎంపిపి రామిరెడ్డి, డాక్టర్. శివానంద్, ప్రకాష్, తిమ్మన్న, లింగేగౌడ్, భీమరాజు, శ్రీరామ్, చంద్రశేఖర్‌గౌడ్, రఘు, నవీన్, సదాశివ, శకునప్ప పాల్గొన్నారు.

## రెండు నెలల్లో రోడ్డు పూర్తిచేసి మీ కలను సాకారం చేస్తాం..!

**-వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.ప్రణయ్‌రెడ్డి**

**-రూ.3.5 కోట్లలో ఇంద్రావతి రోడ్డుకు అట్టహాసంగా భూమిపూజ**


బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.ప్రణయ్‌రెడ్డి

**ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** రెండు నెలల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయించి మీ ఎన్నో యేళ్ల కలను సాకారం చేస్తామని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.ప్రణయ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇంద్రావతి గ్రామంలో సోమవారం మధ్యాన్నం ఆయన ఉరవకొండ నుండి ఇంద్రావతి మీదుగా మోపిడిగ్రామంవరకు 6.5కిలో మీటర్ల మేర 3.5 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీరోడ్డుకు గ్రామసర్పంచ్ సువర్ణమ్మ, ఎంపీపీ చందాచంద్రమ్మ, జెడ్పీటీసీఏ.సి.పార్వతమ్మ, వైస్ఎంపీపీ యం.నరసింహులుతో కలిసి భూమిపూజ చేసి జేసీబీతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వై.ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ 2018 తాను ఇంద్రావతి గ్రామానికి రోడ్డు వేయించే బాధ్యతను తాము తీసుకుంటామని నాడు మాట ఇచ్చానని అందుకు అనుగుణంగా నేడు రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కృషితో 19 ప్రధాన రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ బోయ సుశీలమ్మ, వైస్ ఛైర్మెన్ బోయ సుంకన్న, ఉరవకొండ ఉప సర్పంచ్ జి.వన్నప్ప, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు కె.గోవిందు, జోగి వెంకటేష్, ఆమిద్యాల పీఏసీఎస్ మాజీ ఛైర్మెన్ బి.తేజోనాథ్, పెన్నహోబిళం దేవస్థానం మాజీ ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ సూర్యదేవాలయంలో హుండీ తాళాలు తెరచి ఉండటంపై పోలీసులకు పిర్యాదు

**-ఉరవకొండ గ్రూప్ టెంపుల్స్ ఈఓ అంగదాల క్రిష్ణయ్య**

**ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రసిద్ధ శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో హుండీ సీల్ తీసి ఉండటం, అందులోని నగదు మాయం కావడం, ఇదేమని అడిగితే అర్చకుడు ప్రకాష్‌రావు నన్ను అడగడానికి నీవెవరంటూ గ్రామస్థుల సమక్షంలో తనను నానా దుర్భాషలాడటంపై ఉరవకొండ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడం జరిగిందని ఉరవకొండ గ్రూప్ టెంపుల్స్ ఈఓ అంగదాల క్రిష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకొని 17-02-2022న హుండీకు సీల్ వేయడం జరిగింద న్నారు. పాత ఆలయ కమిటీను తాను పలుమార్లు హుండీ తాళాలు, రికార్డులు స్వాధీనం చేయమని అడిగినా వారు స్పందించలేదన్నారు. ఈక్రమంలో వచ్చే జనవరి నెలలో జరిగే రథ సప్తమి వేడుకల విషయమై గ్రామస్థులతో చర్చించడానికి ఈనెల 25న తాను ఆలయానికి వెళ్లిన సందర్భంలో అక్కడి హుండీను పరిశీలించగా హుండీ సీల్ తీయబడి ఉండటాన్ని గమనించి ఇదెవరు చేశారని అర్చకుడు ప్రకాష్‌రావును అడిగితే ఆయన తనకు తెలియదని నీవెరు నన్ను అడగడానికని నానా దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. హుండీ సీల్ తీయడంపై గ్రామస్థులను విచారించగా ఆలయ పాత కమియే హుండీ సీల్ తీసి హుండీ మొత్తం తీసుకున్నారని తేలిందని వివరించారు. ఈ క్రమంలో తగిన చర్యల నిమిత్తం పోలీసులకు పిర్యాదు చేయడం జరిగిందన్నారు.

## నేడు జగద్గురు శ్రీ కరిబసవ రాజేంద్రస్వామి పుణ్యారాధన

**-శ్రీ గణపతిపూజ, రుద్రాభిషేకం, మహా గణారాధనకు ఏర్పాట్లు**



**ఉరవకొండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీ గవిమఠ సంస్థానం 7వ పీఠాధిపతి శ్రీ కరిబసవ రాజేంద్ర మహాస్వామి వారి 31వ పుణ్యారాధన కార్యక్రమం ఈనెల 27వ తేదిన (నేడు) మంగళవారం స్థానిక మఠంలో జరుగుతాయని మఠం సహాయ కమీషనర్, మేనేజర్ చిట్టెమ్మ సోమవారం తెలిపారు. మఠం 8వ పీఠాధిపతులు జగద్గురు శ్రీ చెన్నబసవ రాజేంద్ర మహాస్వామి వారి ఆధ్వర్యంలో సుప్రభాతసేవతో ఆరాధనోత్స వాలు ప్రారంభమవుతాయని ఉదయం శ్రీ గణపతి పూజ, రుద్రాభిషేకం, స్వాముల దివ్య ఆధ్యాత్మిక సందేశం, మధ్యాన్నం 12 గంటలకు మహాగణారాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## జగనన్న ట్యాబ్‌ల పంపిణీ


విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

**బుక్కపట్నంరూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన బుక్కపట్నంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి గోపాల్ నాయక్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా తహశీల్దార్ నటరాజ్, ఇఓఆర్‌డి ఇందిరబాల, సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపిపి శ్రీధర్ రెడ్డి, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి, జిల్లా అగ్రిబోర్డు అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులే దేశ సంపదని, వారి కోసం ముఖ్యమంత్రి కోట్ల రూపాయలు వెచ్చించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అలాగే ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఈ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కేశవ, మండల నాయకులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలపై ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డికి విన్నపం


ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్సి కల్పలతా రెడ్డి

**శ్రీసత్యసాయిజిల్లా, డిసెంబర్ 26, ప్రభాతవార్త ప్రతినిధి:** వివిధ ఉపాధ్యాయ సమస్యలపై ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కదిరిలోని ఆర్ అండ్‌బి అతిథిగృహంలో ఆమెను కలుసుకొని విన్నవించడం జరిగింది. దీంతో సమస్యలపై స్పందించిన ఆమె అక్కడికక్కడే పరిష్కారంకాగలసమస్యలను అధికారులతోమాట్లాడి పరిష్కరించారు. అలాగే మరిన్ని సమస్యలపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు అశోక్‌కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఇంద్రప్రసాద్, జంషీద్, గంగాధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ప్రకాష్, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసులు, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూములను అసైన్‌మెంట్ చేయాలి

**తహశీల్దార్ కార్యాలయం ముట్టడి.. ఏపి వ్యవసాయ కార్మిక సంఘం**


కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

**రొద్దం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** రొద్దం మండలం పరిధిలోని కోగిరి, శాపురం గ్రామాల్లో వ్యవసాయ కూలీలుగా ఉంటూ 12 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో అసైన్‌మెంట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సాగు చేసుకుంటున్న రైతులతో కలిసి సోమవారం రొద్దం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా భూమిలేని దళితులు, గిరిజనులు వెనుకబడిన వర్గాల ప్రజలు ప్రభుత్వ భూమిని గుర్తించి లక్షలాది రూపాయాలు ఖర్చు చేసుకుని సాగు చేసుకుంటున్నారని. సాగు చేసుకుంటున్న అర్హులైన వారిని గుర్తించి పట్టాతోపాటు పాసుపుస్తకాలు ఇస్తామని గ్రామ సభల్లో ఇచ్చిన హామీ మేరకు ఖచ్చితంగా భూ పట్టాతోపాటు పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల రెవిన్యూ అధికారులు పక్షపాత దోరణితో ఉద్దేశ్యపూర్వకంగా అసైన్‌మెంట్ చేయకుండా మోసం చేయాలని ప్రయత్నిస్తే న్యాయ పోరాటానికి సిద్దమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాగుదారులు బ్రీమాజ్, నారాయణ, నరసింహామూర్తి తదితరులతోపాటు 100 మంది పాల్గొన్నారు.

## తాడింగిపల్లిలో నేడు ఇదేమి ఖర్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**టిడిపి మండల కన్వీనర్ నరహరి**


టిడిపి మండల కన్వీనర్ నరహరి

**రొద్దం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వైసీపీ ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలను ఇదేమీ కర్మరూపంలో ప్రజలకు తెలియజేయడానికి రాష్ట్రం వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యమంలో భాగంగా ఆదేశాల మేరకు బి.కె పార్థసారథి ఆధ్వర్యంలో మంగళవారం రొద్దం మండల పరిధిలోని తాడింగిపల్లిలో ఇదేమి కర్మ అనే కార్యక్రమం నిర్వహిస్తుట్లు టిడిపి మండల కనీ ్వనర్ నరహరి తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

## అధిక వడ్డీ వసూలు చేస్తున్న వడ్డీవ్యాపారులపై చర్యలు తీసుకోండి

**-ఎస్‌పికి ఫిర్యాదు చేసిన హెచ్‌ఆర్‌సిసిఐ నాయకులు**

**పుట్టపర్తిరూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లాపరిధిలోని ధర్మవరం పట్టణం నందు ప్రజల నుండి అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఆర్‌సిసిఐ సభ్యులు జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల నుండి అధికవడ్డీలు వసూలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్న వడ్డీ వ్యాపారుల ఆటలు కట్టించాలని, తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను ఎస్‌పికి అందించినట్లు తెలియజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్ సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. ఎస్‌పిని కలసిన వారిలో హెచ్‌ఆర్‌సిసిఐ డిప్యూటీ ఛైర్మన్ హరిప్రసాద్, శ్రీసత్యసాయి జిల్లా వర్కింగ్ ఛైర్మన్ పాపన్న, అనంతపురం జిల్లా వర్కింగ్ ఛైర్మన్ జహంగీర్ బాషా, అనంతపురం జిల్లా ముస్లింమైనారిటీ ఛైర్మన్ మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఏఎస్సై మన్సూర్ మృతి


గుండెపోటుతో మృతిచెందిన ఏఎస్సై ← మన్సూర్ (ఫైల్‌ఫోటో)

**గుమ్మఘట్ట, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** గుండెపోటుతో గుమ్మఘట్ట ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మన్సూర్ మృతి చెందారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రూరల్ సిఐ యుగంధర్, ఎస్సై సునిత ఏఎస్సై రమణ కానిస్టేబుల్‌లు అధికారులు ప్రజాప్రతినిధులు ప్రగాఢ సానుభూతి సంతానం వ్యక్తం చేశారు. ఏఎస్సై మన్సూర్ మృతి వార్త అందరికీ బాధాకరం.

# సంయుక్త సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

గాండ్లపెంట, డిసెంబర్ 26, ప్రభాతవార్త:
మండలంలోని ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ నందు సోమవారం జరిగిన వాలంటీర్‌లు మరియు నూతన సచివాలయ కన్వీనర్‌లతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వాలం టీర్‌ల వ్యవస్థని ప్రజాప్రతినిధులతో అనుసంధానం చేయాలన్న ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సచివాలయం నుండి ముగ్గురు కన్వీనర్‌లను ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ముగ్గురు కన్వీనర్ లతో వాలంటీర్‌లు అనుసంధానం కాబడి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు మరింత విరివిగా ప్రజల్లోకి తీసుకునేపోయేందుకు అడుగులు వేయడం జరుగుతుందన్నారు. ఆనాడు జగన్‌మోహన్‌రెడ్డి తన సుధీర్ఘ పాద యాత్రలో 3648 కిలోమీటర్లు నడిచి ప్రజల కష్టాలు తెలుసుకొని అధికారం లోకి వచ్చిన తర్వాత ఆనాడు ఇచ్చిన హామీలను పెద్ద ఎత్తున దాదాపు 33 సంక్షేమపథకాలకు శ్రీకారం చుట్టి వాటిని అమలు చేయడం జరుగు తుందన్నారు. కులం,మతం, వర్గం, అన్న బేధాలు లేకుండా ఈ సంక్షే మ పథకాలన్నీ ప్రతి ఒక్కరికి అందాలన్న ఉద్దేశ్యంతో ఈ గ్రామ సచివాలయ వ్యవస్థలను మరియు వాలంటీర్ వ్యవస్థలను తీసుకురావడం జరిగిందన్నారు. 40 సంవత్సరాల ఇండస్ట్రీగా చెప్పుకునే చంద్రబాబు నాయు డు 14 సంవత్సరాల పాలనలో ఏమాత్రం కలలోకి కూడా రానటువంటి ఆలోచనలను జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. ఈ వ్యవస్థ ద్వారా నిరుద్యోగ యు వతకు మన గ్రామీణ ప్రాంతంలో గల సచివాలయ వ్యవస్థల లక్ష నలబై వేలకు పైచిలుకు వాలంటీర్ వ్యవస్థ ద్వారా రెండులక్షల యాభైవేలకు పైచిలుకు ఉధ్యోగాలను కల్పించడమైనది. వీరందరూ కూడా ముఖ్యమంత్రి పైన ఉన్న అభిమానంతో, ప్రేమతో ఆయన చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజ లకు అందాలని అన్న ఉద్దేశ్యంతో నిరంతరం పనిచేస్తున్నారన్నారు. వాలంటీర్‌లు వ్యవస్థ ఏర్పడి ఇప్పటికే మూడు సంవత్సరాలు పైబడినదని, ఈ వ్యవస్థ వచ్చిన తరువాత కరోనా మహమ్మారి నుండి మీ అందరి కృషితో దేశంలో కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంతో మెరుగైన సేవలు అందించ గలిగామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ంలోనే ఉదయం 6 గంటలకే 40లక్షల పెన్షన్‌లు ప్రతి ఒక్క లబ్ధిదారునికి పెన్షన్ పంపిణీచేసే కార్యక్రమం కేవలం వాలంటీర్‌ల ద్వారానే జరుగుతు ందన్నారు. పక్కరాష్ట్రంలో ఎక్కడా కూడా వాలంటీర్ వ్యవస్థ లేదని ప్రసుత తం వారు ఆంధ్రరాష్ట్రానికి వచ్చి వాలంటీర్‌ల సేవల గురించి తెలుసుకొని అక్కడ అమలుపరచాలన్న ఆలోచనతో ఉన్నారన్నారు. ప్రతి ఒక్క కుటుంబం యొక్క సమాచారం మొత్తం మీ వద్ద ఉన్నాయని, ఎవరికి ఏమి పథక వస్తుంది, ఏవిరావు, ఎందుకు రావడం లేదన్న సమాచారం మొత్తం ఉన్నదని, వీటి ద్వారా నిజమైన లబ్ధిదారునికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ వాలంటీర్ వ్యవస్థలతో పాటు ఇంకా మెరుగైన సేవలు అందించే విధంగా మరో కొత్త వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. అదే సచి వాలయ కన్వీనర్ వ్యవస్థ, ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంకా మెరుగైన మంచి కార్యక్రమాలు తీసుకువెళ్ళ వచ్చున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కన్వీనర్‌లు జనవరి 1నుండి పెంచిన పెన్షన్‌ను ప్రతి ఇంటికి వెళ్ళి అందజే యడం జరుగు తుందని, పెన్షన్‌తో పాటు జగన్న అందించిన ఉత్తరమును వారికి అందజేయడం జరుగుతుందన్నారు. వచ్చే జనవరి నుండి కన్వీన ర్‌లతో పాటు గృహ సారధులను ఎంపికచేయడం జరుగుతుందని మీతో పాటు వారు కూడా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజే యడం జరుగుతుందన్నారు. జనవరి 20 తరు వాత వాలంటీర్‌లతో మరి యు గృహ సారధులతో కలిసి మరోక సమావేశం నిర్వహిస్తామని, వాలం టీర్‌లు, కన్వీనర్‌లు మరియు గృహ సారధులు అం దరూ కలిసి జగన్‌మో హన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకెళా ్తరన్నారు. ఇప్పటి వరకు ఒక ఎత్తు ఇంకా రాబోయే కాలం మరోక ఎత్తు ఎన్నికలు దగ్గ రకు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం చేసిన ప్రతి సంక్షేమ కార్యక్రమం ప్రతి ఒక్కరికీ చేరవేయాలని సూచించారు. ఇంత పెద్దఎత్తున జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ఉంటే తెలుగుదే శంపార్టీ బుర దజల్లే కార్యక్రమాలు చేస్తుందన్నారు. వీటన్నింటని ప్రజలలోకి తీసు కువెళ్ళి తెలుగుదేశం పార్టీని ఎండగట్టే కార్యక్రమాలు చేపట్టా లన్నారు. 87శాతం మంది ప్రజలకు ప్రభుత్వం మేలు చేస్తూన్నదని వారికి వచ్చే ఎన్నికలలో ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను తెలుపుతూ జగన్‌మోహా న్‌రెడ్డిని ఆశీర్వదించే విధంగా చూడాలన్నారు. వచ్చే ఎన్నికలలో 175కు 175 స్థానాలలో గెలుపొందే విధంగా అడుగులు వేయాలన్నారు. ఈ రోజు నుండి సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు మరియు వాలంటీర్‌లు ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయంతో పని చేసి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు పెద్ద ఎత్తున చేరవేస్తూ, ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జగన్‌మోహన్,మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, జెడ్పికోఆప్షన్ ఫయాజ్ అలీ, సర్పంచ్‌లు రహంతుల్లా, గజ్జల సిద్దారెడ్డి, సుధాకర, ఆంజి నేయులు, ఎంపిటిసిలు మహమ్మద్ ఇక్బాల్, సోమశేఖర్‌రెడ్డి, గజ్జలరవీం ద్రరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, వాలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, వివిధ శాఖల చైర్మెన్‌లు, డైరెక్టర్‌లు, సోషల్ మీడియా సోదరులు, మరి వైకాపా నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న లారీ ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు

మండల పరిధిలోని వేమారెడ్డిపల్లి వద్ద కదిరి-హిందూపురం ప్రధాన రహ దారిపై సోమ వారం రాత్రి 8 గంటల సమయంలో ఆటోను వేగం గా వస్తున లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్ర ంగా గాయ పడ్డారు. ఈ ప్రమాదంలో కదిరికి చెందిన ఆటోడ్రై వర్ రామాంజినేయులతో పాటు పెడబల్లికి చెందిన బట్టల వ్యాపారి ఈశ్వర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోను ఢీ కొన్న లారీ ఆపకుండా వెళ్లిపోయాడు. కాగా ఇరువురిని 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.


తీవ్రంగా గాయపడ్డ బట్టల వ్యాపారి ఈశ్వర్

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50వేలు ఆర్థిక సహాయం

తలుపుల, డిశెంబర్ 26,ప్రభాతవార్తః
మండలపరిదిలోని బట్రేపల్లి సమీపంలోని రైస్‌మిల్లు వద్ద ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన కార్తీక్ కుటుంబానికి ఎమ్మెల్యే పి,వి.సిద్దారెడ్డి రూ.50వేలు ఆర్థిక సహాయం అందచేశారు.ప్రమాదం జరిగిన రోజు మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాసుపత్రిలో సందర్శించిన ఎమ్మెల్యే కుటుంబానికి అండగా ఉంటానని హామి ఇచ్చారు.ఇచ్చిన హామీ మేరకు సోమవారం ఈదులకుంట్లపల్లి సర్పంచ్ కుమారిభాయి,మాజీ సర్పంచ్ నంసిం హారెడ్డి చేతుల మీదుగా కార్తీక్ స్వగ్రామం మంగివాండ్లపల్లిలో అతని బార్యకు ఆర్థిక సహాయం అందచేశారు.ఈ కార్యక్రమంలో అంజన సుబ్బారెడ్డి,దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందచేస్తున్న దృశ్యం

## నరేంద్రమోడీ పేదప్రజల ఆపద్బాందవుడు
### -బిజెపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు వజ్రభాస్కర్‌రెడ్డి

తలుపుల, డిశెంబర్26,ప్రభాతవార్తః
ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేద ప్రజల ఆపద్బాందవుడని మండలపరి దిలోని బి.కొత్తపల్లి, అక్కసానిపల్లి,దాంపల్లి,ఏపిలవల్లి గ్రామాలలో మండల అధ్యక్షుడు గుడిసె ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన పలకరింపు కార్యక్ర మం లో పేర్కొన్నారు.ఈ సందర్భంగా వజ్రబాస్కర్‌రెడ్డి ఇంటింటికి వెళ్ళి కేంద్ర పభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను వివరిస్తూ మన రాష్ట్రంలో మౌళిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.కరోనా విపత్కర పరిస్థితుల నుంచి నేటి వరకునే కాక మరొక సంవత్సరం 2023 వరకు ఉచిత బియ్యాన్ని పేదప్రజలకు పంపిణీ చేయడం సామాన్య విషయం కాదని,ఆ ఘనత ప్రదానమంత్రి నరేంద్రమోడీకే దక్కుతుందన్నారు.అనంతరం దాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో పిల్లల మధ్యాహ్న భోజనం,పౌష్టిహారం గురించి ఉపాధ్యాయున్ని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గోవర్ధన్ ,గంగా ధర్.మధు,రమణయ్య,మహేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న వజ్రభాస్కర్‌రెడ్డి

## ఘనంగా వంగవీటి మోహన్ రంగా వర్ధంతి వేడుకలు

తలుపుల, డిశెంబర్ 26,ప్రభాతవార్తః
మండలకేంద్రంలోని బస్టాండ్ కృష్ణదేవరాయులు విగ్రహం వద్ద స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి బలిజ సోదరులు పూల మాలలు వేసి ఘన నివాళుల ర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగవీటి చేసిన సేవలను కొనియాడా రు.పార్టీలకతీ తంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషదాయకమన్నారు.


వంగవీటి మోహన్ రంగాకు నివాళులర్పిస్తున్న దృశ్యం

## పాములరాయిలో ఘనంగా అయ్యప్పస్వామి ఊరేగింపు ఉత్సవ కార్యక్రమం

అనంతపురం రూరల్,డిసెంబర్26ప్రభాతవార్త:
అనంత రూరల్ మండలం సోమలదొడ్డి పంచాయితీ పాములరాయి గ్రామం లో అయ్యప్ప స్వాములు గ్రామంలోని అయ్యప్పస్వామి గుడిలో అయ్యప్ప పూజ కార్యక్రమంను భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించి అనంతరం వారు గ్రా మంలో అయ్యప్ప స్వామి ప్రతిమను ఊరేగించి అయ్యప్పస్వామి ఊరేగింపు ఉత్స వ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇరుముడి సమయం దగ్గరకు వచ్చిన సమ యంలో పాములరాయు గ్రామంలో అయ్యప్పస్వామి గుడిలో భక్తి శ్రద్దలతో పూ జ కార్యక్రమాలు నిర్వహించి,గ్రామం మొత్తం అయ్యప్ప స్వామి ప్రతిమను ఊరేగింపు చేసి ఘనంగా అయ్యప్పస్వామి గ్రామ ఉత్స వ కార్యక్రమం నిర్వ హించడం జరుగుతుందన్నారు.అనంతరం గ్రామంలోని ప్రజలందరికి అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అయ్యప్పస్వాములతో పాలు ప్రజలు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ

గాండ్లపెంట, డిసెంబర్ 26, ప్రభాతవార్త:
రాష్ట్రంలో ఏ పార్టీ అధికా రంలో ఉన్నా ప్రజల పక్షాణ సిపిఐ పార్టీ రాజీలేని పోరా టాలు చేస్తున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి శ్రీరాము లునాయుడు పేర్కొన్నారు. సిపిఐ పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమ వారం మండలంలోని రెక్కమా ను గ్రామంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జె ండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి శ్రీరా ములునాయుడు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సిపిఐ కార్య దర్శి మాట్లాడుతూ రైతులు, రైతు కూలీలు, పేదల తరుపున నిరంతరం పోరా టాలను సాగిస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ప్రజా వ్యతిరేఖ విధానా లను అవలంభిస్తున్నట్లు తెలియజేశారు. కావున ప్రతి ఒక్క రూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ప్రజలు సిపిఐ పార్టీకి మద్దతు తెలపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేష్ నాయక్, రెడ్డెప్ప, తిమ్మయ్య, వెంకటరమణ, బయమ్మ, వెంకటప్ప, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మండల సిపిఐ నాయకులు

## స్పందనకు 7 అర్జీలు

యల్లనూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 7 అర్జీలు వచ్చినట్లు తహాశీల్దార్ రమాదేవి తెలిపారు. ఇందులో డి పట్టాలకు సంబంధించి 2, ఒపి ఫించన్‌కు 1, వసరణ చేయాలని 2, పప్పుశనగ పంటనష్టపరిహారం కోసం 1, ఇంటి స్థలం ఆక్రమణకు గురైందని ఒక అర్జీ వచ్చినట్లు తహాశీల్దార్ తెలిపారు. అదేవిధంగా తహాశీల్దార్ చేత అభయ ఫౌండేషన్ పోస్టర్లను విడుదల చేయించారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న తహాశీల్దార్ రమాదేవి

## నారా లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకుడు

యల్లనూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను హైదరాబా ద్‌లోని ఆయన నివాసంలో యల్లనూరు మండలం కోడుమూర్తి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వెూహన్ నాయుడు సోమవారం మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం నారా లోకేష్ పార్టీ బలోపే తం గురించి, శింగన మల నియోజక వర్గంలో తాజా రాజకీయ పరిస్థితుల గురించి మోహన్ నాయుడుతో చర్చించినట్లు తెలిపారు.


నారా లోకేష్‌కు పుష్పగు చ్ఛం అందచేస్తున్న మోహన్ నాయుడు

## లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి, డిసెంబర్ 26 ప్రభాతవార్త
మండలంలోని రాయల చెరువు గ్రామంలో వున్న లీలా వతి వృద్ధాశ్రంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామరాజుపల్లి గ్రామా నికి చెందిన సుజాత తన భర్త ప్రభాకర్‌గౌడ్ తృతీయ వర్ధంతిని పురస్క రించుకుని వృద్ధులకు అన్నద ాన కార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. సుజాత తన కుటుంబస భ్యులతో ఆశ్రమానికి వచ్చి వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించారు.


వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

# మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

యాడికి, డిసెంబర్ 26 ప్రభాతవార్త
అనారోగ్యంతో మృతి చెందిన మిద్దె వెంకటనారాయణమ్మకు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు ఇలా వున్నాయి. పెద్దపప్పూరు మం డలం కుమ్మెత నరసాపురం గ్రామానికి చెందిన మిద్దె వెంక టనారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు కుమారుడు మిద్దె నాగరాజు మాత్రమే వుండడం బంధువులు అంత్యక్రియలకు రాలేకపోయారు. దీంతో ఆమె కొడుకు యా డికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ అధ్యక్షులు బండారు బాల కృష్ణకు సమాచారం అందించారు. వెంటనే ఫౌండేషన్‌లోని మిగిలిన సభ్యులకు విషయం తెలియచేసి నరసాపురం గ్రామానికి వెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియలు నిర్వహించడానికి బంధువులే వెనుకాడుతున్న తరుణంలో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు ముం దుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించడం పట్ల వారికి మిద్దె నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. అనాధ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడానికి మా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ముందుంటుందని యాడికి ఫౌండేషన్ అధ్యక్షులు బండారు బాలకృష్ణ తెలియచేశారు. ఈ కార్య క్రమంలో ఆలూరు చంద్రశేఖర్‌రెడ్డి, చింతా నరసి హ, చందగాని ద్రువనారాయణ, గాంధీజీ స్కూల్ రామ్మోహన్, బడిగించల వేణు, మెటికల చెన్నయ్య, పల్లా ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


అంత్యక్రియలకు తీసుకెళుతున్న దృశ్యం


అంత్యక్రియల్లో పాల్గొన్న మే ఐ హెల్ప్ యు సభ్యులు

## గ్రామాల్లో క్షయవ్యాధి సర్వే


సర్వే చేస్తున్న దృశ్యం

నార్పల రూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త
మండలంలోని బొందనవాడ గ్రామంలో క్షయవ్యాధిని గుర్తించేందుకు సబ్ నేషనల్ సర్టిఫికేషన్ సర్వేను సోమవారం డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో ఎస్‌టిఎస్ ఉమామహేశ్వరి చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు మహేష్, శ్రావణిలు తనిఖీ చేశారు. ప్రతిరోజు ఇంటి ంటికి వెళ్లి క్షయగ్రస్తులను గుర్తించి తగు చికిత్స అందించి సరిపడ మందులను అందచేయాలన్నారు. ప్రతి గ్రామంలో క్షయవ్యాధిగ్రస్తులకు సర్వే చేసి అవసరమైన వ్యాధి అంశాల గురించి తెలియచేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌భాస్కర్, ఆశావర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## టిసిఎస్ కంపెనీకి టెక్ విద్యార్థుల ఎంపిక


ఉద్యోగానికి ఎంపికైన వారు

తాడిపత్రిరూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త
పట్టణ సమీపంలోని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో టిసిఎస్ కంపెనీవారు నిర్వహించిన ఇంటర్వ్యూలో 7 మంది టెక్ విద్యారులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇవి సుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో కంప్యూ టర్ విభాగంలో 4, ఎలక్ట్రానిక్స్ విభాగంలో ముగ్గురు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగానికి ఎంపికైన సిఎస్ఇ విభాగానికి చెందిన ధరణి, జనార్ధన్, నఫీనాపర్వీన్, సప్రజ, ఇసిఇ విభాగానికి చెందిన శ్రావణి, గంగాదేవి, పరిమళ అనే విద్యార్థులకు సంవత్సరానికి 7.0 లక్షల రూపాయల వేతనం వుంటుందన్నారు. 2019-23 సంవత్సరానికి గాను ఇప్పటి వరకు 30 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి, డిఓఎ నటరాజేశ్వర్‌రెడ్డి, ట్రైనింగ్ విభాగం అధినేత నవీన్‌లు అభినందనలు తెలిపారు.

## క్రీడల్లో ప్రతిభ చూపిన ప్రత్యూష
### - అభినందనలు తెలిపిన కళాశాల యాజమాన్యం


పతకాలు అందుకు ంటున్న ప్రత్యూష

ముదిగుబ్బ, డిసెంబర్ 26 ప్రభాతవార్త
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ స్పోర్ట్స్ క్రీడల్లో ముదిగుబ్బకు చెందిన బాలాజీ విద్యాసంస్థ ఎస్‌బిఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచి వంద మీటర్లు, 200 మీటర్లు, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో నాలుగు బంగారు పతకాలు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యూషను కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి సమక్షంలో సత్కరించడం జరిగింది. భవిష్యత్తులో తమ కళాశాల విద్యార్థులు మరిన్ని పతకాలు సాధించి ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రిన్సిపాల్ శివారెడ్డి పేర్కొన్నారు. సత్కారసభలో కళాశాల సిబ్బంది నాగ రాజు, మల్లికార్జున, సుధాకర్, రఘునాథరెడ్డి, సురేష్, తదితరులు పాల్గొ న్నారు. పతకాలు సాధించిన విద్యార్థిని ప్రతూ్యషను బాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె రఘునాథరెడ్డి, పల్లె కిషోర్‌లు అభినందించారు.

## ప్రత్యేక పుష్పాలంకరణలో పరమేశ్వరుడు

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త
పట్టణంలోని పురాతన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి సోమవారం ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మామాసం పురస్కరిం చుకుని ఉదయం స్వామివారికి అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు అభిషేకాలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేక ంగా అలంకరించారు. శ్రీరాజ రాజేశ్వరిదేవి అమ్మవారికి అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు కుంకు మార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.


శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

## పెద్దపప్పూరులో కమ్యూనిస్టు పార్టీ 98వ ఆవిర్భావదినోత్సవం


మాట్లాడుతున్న చింతా పురుషోత్తం

పెద్దపప్పూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త
మండల కేంద్రంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం మాట్లాడుతూ భారతకమ్యూనిస్టు పార్టీ పీడిత ప్రజల కోసం ఎనలేని త్యాగాలు చేసిందన్నారు. లక్షలాది ఎకరాలకు పేదలకు పంచి ందన్నారు. నిజాం రాజకీయాన్ని రద్దు చేయడంలో కీలక భూమిక పోషిం చిందన్నారు. బా ్యంకులను జాతీయం చేయడంలో ప్రధాన పాత్ర పోషించి ందన్నారు. ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు అగ్రగామిగా నిలిచిందన్నారు. భారతకమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రతి ఒక్క పేదవాళ్లకు ఇంటి స్థలాలు, భూములు, ఈ పార్టీ ద్వారా గృహ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెను భారం ప్రజలపై వేయడంలో వాటికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి పార్టీ ఉద్యమం చేసి నిలబెట్టిన ఏకైక పార్టీ సిపిఐ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు భోగాతి రామేశ్వర్‌రెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి తలారి రామకృష్ణ, ఏపి చేనేత కార్మిక సంఘం మండల నాయకులు చింతా ప్రసాద్, జి.సుబ్రమణ్యం, నారాయణస్వామి, షఫి, అబీ బు, చింతా ఆంజనేయులు, లింగం లోకేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవం

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త
పట్టణంలోని రంగప్పకాలనీలో సోమవారం సిపిఐ 98వ ఆవిర్భావ దినో త్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇం దులో భాగంగా సిపిఐ తాడి పత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ రంగ య్య, పట్టణ కార్యదర్శి చిరంజీ వియాదవ్, తదితరులు సిపిఐ జెండా ఆవిష్కరించారు. అనంత రం వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల నిర్భంధకాండకు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1925 డిసెంబర్ 26న కాన్పూర్ (ఉత్తరప్రదేశ్) గడ్డపై సిపిఐ ఆవిర్భవించిందన్నారు. మహోన్నత త్యాగాలు, మహత్తర విజయాలకు సిపిఐ ప్రతీకగా నిలిచిం దన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు పిలుపునిచ్చిన పార్టీ సిపిఐ అన్నారు. నేడు బిజెపి, ఆర్ఎస్ఎస్ కులం, మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్న బిజెపిని తరమికొట్టాలన్నారు. సిద్ధాంత పరంగా ఓడించే శక్తి కమ్యూని స్టులకే వుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగరంగయ్య, పట్టణ సహాయ కార్యదర్శి రామాంజినేయులు, సాదక్‌వలి, రమణ, రత్నమమ్మ, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సిపిఐ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

## ముఖ్యమంత్రికి నియోజకవర్గ సమస్యలను వివరించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ

శింగనమల, డిసెంబర్ 26 ప్రభాతవార్త
తాడేపల్లిలోని క్యాంపు కార్యాల యంలో సోమవారం ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రె డ్డిని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మా వతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సల హాదారు ఆలూరు సాంబశివారెడ్డి కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది. అందులో ముఖ్యంగా ఉల్లికల్లు, ఉల్లికంటి పల్లికి సంబంధించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం నిధులు ఈస్ట్ నరసాపు రంలో బిసి వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు భవనాలు, యల్లనూరు వద్ద ఉన్న చిత్రావతి నదిపై, శింగవరం వద్ద, శింగనమల మరువ వద్ద, బుక్కరా యస ముద్రం మరువ వద్ద బ్రిడ్జిలు, కొత్తగా ఏర్పడిన శింగనమల పుట్లూరు పోలీస్ సర్కిల్ ఆఫీసులకు బిల్డింగులు, నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అప్పటికే ఇచ్చిన పట్టాలలో ఇళ్ల మంజూరు, సింగనమల చెరువు పాత మరవ నుంచి బస్టాండ్ వరకు డబల్ రోడ్, శింగనమలలోని సోదనపల్లి ,యల్లనూ రులోని నీరాజంపల్లిలో సిసి రోడ్డు, డ్రైనేజీలు. ముఖ్యమంత్రి అన్నింటికీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

## క్రికెట్‌టోర్నీని ప్రారంభించిన ఆలూరు సాంబశివారెడ్డి


బ్యాటింగ్ చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి


క్రీడాకారులతో ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల, డిసెంబర్ 26 ప్రభాతవార్త
రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బెంగుళూరులో బికె.క్రికెట్ మైదానంలో సోమవారం వైఎస్ఆర్ సిపి ఐటి వింగ్ క్రికెట్‌టోర్నీని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహా దారులు ఆలూరు సాంబశివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు బ్యాటింగ్ క్రీడా కారులతో కలిసి చేశారు. అనంతరం వారితో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

